# సత్యవాక్యం

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY 2008

సంవత్సర చందా రూ. 50/-



J.C. CHOATE

1932 - 2008

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O.Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | ఫిబ్రవరి 2008 | సంచిక 7


## పాపము యొక్క పర్యవసానము

(The consequence of Sin)

పాపమనగా యేమిటో యిదివరకే మనం నేర్చుకొనియున్నాము. ఆజ్ఞాతిక్రమమే పాపమనియు, విశ్వాసమూలము కానిది యేదో అది పాపమనియు, సకల దుర్ణీతియు పాపమనియు మనం తెలిసికొనియున్నాము. అయితే "దుష్ క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగకపోవుట చూచి మనుష్యులు భయమును విడిచి హృదయపూర్వకముగా దుష్క్రియలు చేయుదురు" (ప్రసంగి 8:11). పాపమునకు శీఘ్రముగా శిక్ష కలుగక పోవచ్చును గాని శిక్ష మాత్రము తధ్యము.

మానవుడు పాపము చేసిన నాటినుండి దాని ఫలితమును అనుభవించు చునేయున్నాడు. మానవుని పాపమువలన "సృష్టియావత్తు ఇదివరకు ఏకగ్రీవముగా మూలుగుచు ప్రసవవేదన పడుచునున్నదని యెరుగుదుము" (రోమా 8:22). ఏదెనులో ఆదాము హవ్వలు పాపము చేయగా దేవుడు

ఆదాముతో, "తినవద్దని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనకు నీ నిమిత్తము నేల శపింపబడి యున్నది. అది ముండ్ల పొదలను గచ్చపొదలను నీకు మొలిపించును. పొలములోని పంటతిందువు. నీవు నేలకు తిరిగి చేరు వరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు; ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను" "ఆయన స్త్రీతో నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో నీవు పిల్లలను కందువు" అని చెప్పెను (ఆది.కా. 3: 16-19). పాపము వలన ఆదాము హవ్వలు ఏదెను వనము నుండి తరిమివేయబడిరి, మరియు జీవ వృక్షము నుండి వేరుచేయబడిరి. అందువలన భౌతిక మరణము సంభవించెను. ఈనాడు ఎవరు ఎక్కడ మరణించినను అది ఆదాము హవ్వల పాపము యొక్క పర్యవసానమే. "మనుష్యుని ద్వారా మరణము వచ్చెను, గనుక మనుష్యుని ద్వారా మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, అలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింప బడుదురు" (1 కొరింథీ 15: 21-22). ఈ లోకంలో యున్న దుఃఖము, రోగములు, శ్రమలు, బాధలు, మరణము వగయిరా అన్నియు ఆదాము చేసిన పాపము యొక్క పర్యవసానమే, మరియు మన స్వకీయ పాపముల వలన వాటిని మరింత ఉధృతము చేసికొనుచున్నాము. యిది పాపము వలన కలిగే తాత్కాలిక శిక్ష.

## ఆత్మీయ మరణం

అయితే పాపమువలన కలిగే అసలైన శిక్ష నిత్యమైనది. పాపము వలన కలుగు జీతము మరణము అని బైబిలు చెప్పుచున్నది (రోమా 6:23). యిది దేవుని నుండి నిత్యము వేరైపోవుటను సూచించుచున్నది. దేవుడు ఆదాముతో ఏదెను వనములోని "మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తిన కూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరునికాజ్ఞాపించెను" (ఆది.కా. 2:17). నరుడు నిషేధించిన ఫలములను తినిన దినముననే భౌతికంగా చావలేదుగాని ఆత్మీయంగా ఆ దినమందే దేవుని నుండి వేరై చనిపోయాడు. గనుక ఆదాము హవ్వల పాపము వలన మానవజాతికంతటికీ భౌతిక మరణం

సంక్రమించితే, ప్రతివాడు తాను చేసుకొనిన పాపమువలన ఆత్మీయమరణము నొందును. "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణము లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్య లందరు పాపము చేసినందు వలన మరణము అందరికిని సంప్రాప్త మాయెను" (రోమా 5:12).

"పాపము చేయువాడే మరణమునొందును; తండ్రి యొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోషశిక్షను తండ్రి మోయదు; నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును; దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును. అయితే దుష్టుడు తాను చేసిన పాపములన్నిటిని విడిచి, నా కట్టడలన్నిటిని అనుసరించి న్యాయము జరిగించిన యెడల అతడు మరణమునొందదు, అవశ్యముగా అతడు బ్రదుకును" అని యెహోవా దేవుడు సెలవిచ్చియున్నాడు (యెహెజ్కేలు 18: 20-21). పాపముల విషయమై మారుమనస్సు పొందనియెడల, యేసు దేవుని కుమారుడని నమ్మనియెడల అందరు నశింతురు (లూకా 13:3; యోహాను 8:21,24).

## నిత్యశిక్ష

పాపమువలన నిత్యశిక్ష కలుగును. "భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారి మీదికి ఉగ్రతయు, రౌద్రమును వచ్చును. దుష్కార్యము చేయు ప్రతిమనుష్యుని ఆత్మకు మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ శ్రమయు వేదనయు కలుగును" (రోమా 2:8-9). "పిరికి వారును, అవిశ్వాసులును అసహ్యులును నరహంతకులును వ్యభిచారులును మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికు లందరును అగ్నిగంధకములతో మండుగుండములో పాలుపొందుదురు. ఇది రెండవ మరణము" (ప్రక 21:8). "వారు యుగయుగములు రాత్రింబగళ్లు బాధింపబడుదురు" (ప్రక 20:10). "నరకమున వారి పురుగుచావదు; అగ్ని ఆరదు" (మార్కు 9:48), "వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు" (మత్తయి 25:46). ఈ లేఖనములను బట్టి యేమి అర్థమగుచున్నది? పాపమువలన కలిగే శిక్ష నిత్యమైనది; అది ఘోరమైనది.

"అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగా క్రీస్తు మన కొరకు చనిపోయెను. కాబట్టి

ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడిన యెడల సమాధాన పరచబడినవారమై ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:8-10).

**క్రీస్తు రక్తము ద్వారా విమోచన**

మానవుడు నిత్యశిక్ష ననుభవించాలని దేవుడు కోరుటలేదు. సరిగదా, "ఆయన మనుష్యులందరు రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమోతి 2:4). "దేవుడొక్కడే దేవునికిని నరునికిని మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు. ఈయన అందరి కొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను" (1 తిమో 2:5). యేసుప్రభువు తన పరిశుద్ధ రక్తము చేత మనలను పాపము నుండి విమోచించియున్నాడు. ఏలయనగా "రక్తము చిందింపబడ కుండా పాపక్షమాపణ కలుగదని సామాన్యముగా చెప్పవచ్చును" (హెబ్రీ 9:22). అయితే "ఎడ్ల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10:4). అందువలన యేసుక్రీస్తు "మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" (హెబ్రీ 9:12). మనకు రక్షణ మార్గమును తెరిచెను. అందుకే "వెండి, బంగారముల వంటి క్షయం వస్తువులచేత మీరు విమోచింపబడలేదు. గాని, అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగరా?" యని రక్షింపబడిన క్రైస్తవులకు అపో. పేతురు హెచ్చరిక చేసాడు (1 పేతురు 1:18-19).

**పాపక్షమాపణ పొందాలంటే...**

ఇప్పుడు మనము పాపముల నుండి విముక్తులము కావాలంటే, మన కొరకై సిలువపై బలియైన యేసుప్రభువు నందు విశ్వాసముంచాలి. యేసుప్రభువు తన కాలమునాటి యూదులతో, "మీరు క్రిందివారు, నేను పై నుండువాడను; మీరు ఈలోక సంబంధులు,నేను ఈలోక సంబంధుడను కాను. కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను

ఆయన నని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను" (యోహాను 8:23-24). మరల మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు ఆలాగే నశింతురని ఆయన చెప్పెను (లూకా 13:5). ఇంకా, "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును" అని ఆయన చెప్పెను నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును" అని ఆయన చెప్పెను (మత్తయి 10:32-33). "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతికలుగునట్లు మనష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:9-10). చివరిగా క్రీస్తు సువార్తను "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడును" అని ఆయన చెప్పెను (మార్కు 16:16).

ఇప్పుడు యేసుప్రభవు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, ఆయన యందలి విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినవాడు పాపవిముక్తుడగును. అతడు రక్షింపబడినవాడై క్రీస్తుచే క్రీస్తు సంఘముతో చేర్చబడి మరణపర్యంతము నమ్మకముగా యున్న యెడల నిత్యజీవకిరీటాన్ని పొందును.

"కాబట్టి శరీర దురాశలకు లోబడునట్లుగా చావునకు లోనైన మీ శరీర మందు పాపమును ఏలనియ్యకుడి. మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి. అయితే మృతులలో నుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించు కొనుడి, మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించుడి" (రోమా 6:12-13). దేవుడు మిమ్మును దీవించునుగాక !!

# సంఘ పవిత్రత
# (Purity of Church)

సిద్ధాంతములోను, నైతికముగాను సంఘముయొక్క పవిత్రతను గూర్చి ఈ పాఠములో గమనింతము: సంఘము సజీవమై ప్రత్యేకముగా యుండవలెనన్న ఈ రెండును అవుసరమై యున్నవి.

మొదటిగా, సిద్ధాంతరీత్యా సంఘము యొక్క పవిత్రతను గమనించుదము. సంఘమును కట్టుదునని క్రీస్తు వాగ్దానము చేసెను. ఆ పని సరిగ జరిగించుటకు అపొస్తలులను నడిపించు నిమిత్తము పరిశుద్ధాత్మని పంపించెదనని ఆయన వాగ్దానము చేసెను (మత్తయి 16:18; యోహాను 16:13; అపొ.కా. 2). ప్రవచింపబడిన రీతిగను, ప్రభువు వాగ్దానము చేసిన రీతిగను సంఘము స్థాపించబడెను (యెషయా 2:2,3; యోవేలు 2:28,29; మార్కు 9:1). అపొస్తలులును, వారు చేతులుంచిన వారిని క్రొత్తనిబంధన వ్రూర్తిగా లిఖితపూర్వకముగా ఇయ్యబడవరకు పరిశుద్ధాత్మడు నడిపించెను. అప్పటి నుండియు సంఘము యొక్క మాదిరివలె క్రొత్తనిబంధన పనిచేయును (అపొ.కా. 2:1-4; 6:1-6; యాకోబు 1:25; 2తిమోతి 3:16,17). ప్రభువునకు లోబడుటలో ఆ మాదిరి ననుసరించువారే క్రీస్తు సంఘమై యున్నారు. వారు తమ ఆచరణలోను, బోధలోను దానిని మాత్రమే అనుసరించి నడచుకొనినంత కాలము, ప్రభువు తన ప్రజల నుండి ఎట్టి పవిత్రతను కోరుచున్నాడో అట్టి పవిత్రతను వారు కలిగియుందురు.

సంఘము స్థాపించబడిన వెంటనే "వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్ధన చేయుటయందును ఎడతెగక యుండిరి" యని మనము చదువగలము (అపొ.కా. 2:42). అంటే వారు అపొస్తలుల బోధలో నిలకడగా యుండిరి. క్రీస్తు వారికి బోధించిన బోధను అపొస్తలులు బోధింపవలెనని ఆజ్ఞాపింపబడిరి (మత్తయి 28:19,20). ఉపదేశము యొక్కయు, సిద్ధాంతము (బోధ) యొక్కయు ఆరంభ స్థావరమును పరిశోధించి కనుగొనగలిగిన యెడల వాటి పవిత్రత సాధ్యమగును. అపొస్తలులు వెళ్ళి సమస్త జనులకు బోధించి, బాప్తిస్మమిచ్చి, యేసు వారికి

ఏయే సంగతులను ఆజ్ఞాపించెనో వాటినన్నిటిని వారును గైకొనవలెనని బోధించుడి యని ఆయన వారికి చెప్పెను. పౌలు ఇట్లనెను: "అనేక సాక్షుల యెదుట నా వలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము" (2 తిమోతి 2:2).

హితబోధను బోధించుట ఎంతో ప్రాముఖ్యమని చెప్పబడెను. పౌలు ఇట్లు వ్రాసెను: "తాను హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడువారి మాటలు ఖండించుటకును శక్తిగలవాడగునట్లు, ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొనువాడై యుండవలెను" (తీతు 1:9). "నీవు హితబోధ కనుకూలమైన సంగతులను బోధించుము" అని అతడు మరల చెప్పెను (తీతు 2:1). తిమోతికి వ్రాయుచు అతడిట్లు హెచ్చరించెను: "దేవుని యెదుటను, సజీవులకును, మృతులకును తీర్పు తీర్చు క్రీస్తు యేసు యెదుటను, ఆయన ప్రత్యక్షతతోడు ఆయన రాజ్యము తోడు నేను అనబెట్టి చెప్పునదేమనగా, వాక్యమును ప్రకటింపుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము" (2 తిమోతి 4:1,2). "నిన్ను గూర్చియు, నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము; వీటిలో నిలకడగా ఉండుము; నీవీలాగు చేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు" అని అతడు మరల తిమోతికి వ్రాసెను (1తిమోతి 4:16). మొదటి శతాబ్దములో యున్న వారికి ఈ హెచ్చరిక మాటలు ఎట్లు వర్తించెనో అట్లే యవి మనకు ఈనాడు వర్తించవా ?

లేఖనములకు మనము కలుపుట, తీసివేయుట, మార్చివేయుట, వాటిని అతిక్రమించుట జరిగించరాదని మనము పదేపదే హెచ్చరింపబడి యున్నాము (ప్రకటన 22:18,19; గలతీ 1:6-9; 2 యోహాను :9). దేవుడు మాట్లాడెను. ఆయన తన చిత్తమును మనకు బయలుపరచెను. దానిని మనము హృదయపూర్వకముగా అక్షరాల అనుసరింపవలెనని ఆయన కోరుచున్నాడు. విశ్వాసము నుండి కొందరు తొలగిపోవుదురు అని పౌలు, యితరులు మనలను హెచ్చరించిరి. ఆ హెచ్చరికను లక్ష్యపెట్టనందున ఈనాడు క్రైస్తవలోక మంతయు విభజింపబడి యున్నదని మన మెరగుదుము. మన

చుట్టూ యున్న క్రైస్తవ లోకమును మనము గమనించిన తరువాత ప్రభువు మనలను ఏమి చేయవలెనని కోరుచున్నాడో తెలిసికొను నిమిత్తము మనము పరిపూర్ణముగ బైబిలు నొద్దకు మరలుట అత్యవసరము. మనము ఆయన సత్యమునొద్దకు మరల వలసినదని క్రీస్తు నిశ్చయముగా మనలను ఆహ్వానించుచున్నారు, హెచ్చరించుచున్నారు, విజ్ఞాపన చేయుచున్నారు; మనమందరము ఏకమై యుండవలెనని ఆయన ప్రార్థించెను (యోహాను 17:20-23). పౌలు విభజనలను ఖండించుట మాత్రమే గాక, మనమందరము ఏకీభావము కలిగి యుండవలెనని హెచ్చరించుచు, మనమెట్లు ఐక్యత కలిగి యుండగలమో కూడ చూపించెను (రోమా 16:17,18; 1 కొరింధి 1:10; ఎఫెసీ 4:1-6).

పవిత్రముగా యుండవలెనన్న, బైబిలులో యున్న సంఘము యొక్క సత్యమును అంగీకరించి బోధించవలెను. సంఘం నామమును గూర్చి పాలన పద్ధతిని గూర్చి, అందు ప్రవేశించుటకున్న షరతులను గూర్చి సంఘారాధన మొదలుగు వాటిని గూర్చిన సత్యములను బైబిలునందున్న రీతిగ అనుసరించి బోధించవలెను. మనము నైతికముగా ఎంత పవిత్రులమైనను, క్రీస్తు బోధ మనలో లేనప్పుడు మనము దేవుని బిడ్డలము కాజాలము.

తరువాత, సంఘము నైతికముగా పవిత్రత కలిగియుండవలెను. మరల సంఘము సిద్ధాంతరీత్యా ఎంత పవిత్రురాలైనను, అది నైతిక పవిత్రతను కలిగి యుండని యెడల దేవుని సంతోష పరచలేము. మనము భక్తిని పరిశుద్ధతను బోధించుట మాత్రమే గాక వాటిని అలవరచుకొనవలెను.

సంఘములో పాపమును గూర్చియు, లౌకిక అలవాట్లను గూర్చియు లేఖనములు మనలను హెచ్చరించుటయే గాక వాటిని ఖండించుచున్నవి. కొరింధీయులు వారిలోయున్న భక్తిహీనతనుండి తొలగి పోవవలెనని పౌలు హెచ్చరించెను (1కొరింధీ 5). మనము ఈ లోకమును, దానిలో ఉన్నవాటిని ప్రేమింపకూడదని యోహాను వ్రాసెను (1 యోహాను 2:15-17). పౌలు తీతుకు యిట్లు వ్రాసెను: ''ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై, మనము భక్తిహీనతను,

ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రదుకుచుండ వలెనని మనకు బోధించుచున్నది" (తీతు 2:11,12). లేఖనములలో సంఘములో యున్న పాపమును ఖండించుచు తద్వారా కలుగు ప్రతిఫలమును గూర్చి చెప్పు అనేక వచనములను మనము చూడగలము. దేవుని ప్రజల హృదయములోను, జీవితములోను పాపమునకు అపవిత్రతకు తావు ఎక్కడను ఉండరాదు.

క్రైస్తవుడు తగిన జీవితమును జీవించుటకు అతని ప్రోత్సహించు నిమిత్తము లేఖనములు ప్రాధమికముగా వ్రాయబడెను. అందువలన అతడు స్వస్థబుద్ధితోను నీతితోను భక్తితోను బ్రదుకుచుండవలెను. రక్షింపబడిన వారితో సంఘము సమకూడియున్నది. తన ప్రజలు ఆయనకు నమ్మకముగా యుండవలెనని ప్రభువు కోరుచున్నారు. క్రీస్తు యిట్లనెను: "హృదయశుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). మరియు ఆయన అందరితో ఇట్లనెను-ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతి దినము తన సిలువను ఎత్తుకొని నన్ను వెంబడింప వలెను" (లూకా 9:23). యాకోబు ఇట్లను చున్నాడు: "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా-దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తన కంటకుండ తన్ను తాను కాపాడుకొనుటయునే" (యాకోబు 1:27). పవిత్రమైన సంఘము కొరకు ప్రభువు తిరిగి వచ్చుచున్నాడని పౌలు చెప్పుచున్నాడు. అతడిట్లనెను: "క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి అది కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి యేదైనను లేక, పరిశుద్ధమైనది గాను, నిర్దోషమైనదిగాను.....దానిని నిలువబెట్టుకొనవలెనని, దాని కొరకు తన్ను తాను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ 5:27).

అయితే క్రీస్తు సంఘము నైతికముగాను, ఆత్మీయముగాను పవిత్రముగా ఎట్లుండును? వాక్యమును అనుసరించుట ద్వారా, ప్రార్ధన ద్వారా, క్రైస్తవులతో సహవాసము కలిగి యుండుట ద్వారా, దేవుని పనియందు నిమగ్నులై యుండుట ద్వారా, ఇతరులకు సహాయము చేయుటద్వారా, మేలైన వాటిని యోచించుట ద్వారా, దేవునికి

మన ధనమును, మన శరీరములను అప్పగించుకొనుట ద్వారా సంఘము పవిత్రత కలిగియుండును. మనము ప్రభువు కొరకై ప్రత్యేకించు కొనిన యెడల ఒక దినమందు ఆయన వచ్చి ఆయన ఉన్నచోటుననే మనమును ఉండులాగున ఆయన మనలను కొనిపోవును అని వాగ్దానము చేయబడియున్నది. ఈలోగా మన జీవితములోను బోధనలోను మనము కనుబరచు పవిత్రత ఇతరులను కూడ ఆకర్షించును. ఏలయనగా పవిత్రమైన దానికంటె ఆకర్షించు గుణముకలది మరొకటి లేదు. దేవునిలోను, ఆయన చిత్తములోను వేరొక చోట అగుపడని పవిత్రత మనకు కనబడుచున్నది. గనుక మన జీవితమును శుద్ధిచేసుకొని వాటిని పవిత్రపరచుటలో మనము ఆయనవలె తయారగుదుము. ఒక ఆశ్చర్యకమైన సంగతి ఏమంటే క్రీస్తుకు లోబడుచు లేఖనములలో బయలుపరచబడిన ఆయన అడుగుజాడల ననుసరించి నడుచుకొని యెడల అందరును పవిత్రులై యుండగలరు.

– జె.సి.ఛోట్


క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

**సత్యవాణి కార్యక్రమములను**

ప్రతి శనివారం ఉదయం 6:30 గంటలకు T.V. - 5లోను ప్రతి సోమవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 6:00 నుండి 6:30 వరకు తిరిగి రాత్రి 10:00 నుండి 10:30 వరకు శుభవార్త ఛానల్‌లో చూడండి.

ప్రసంగీకులు : **Bro. జాషువాగౌతం గారు**

**Bro. లక్ష్మీగౌతం గారు**

# తీర్పు వచ్చుచున్నది
## (Judgement is Coming)

**పరిచయము:** ప్రకటన 14వ అధ్యాయము చదువుము. ప్రకటన గ్రంథం మధ్యలో అంతిమ తీర్పును గూర్చి చదవడం వింతగా అనిపించవచ్చును.

- 12వ అధ్యాయములో సాతానుడు అనేక తలలు కొమ్ములు గల ఘట సర్పముగా వర్ణించబడెను.
- 13వ అధ్యాయములో క్రూరమృగము సముద్రములో నుండిపైకి వచ్చుట చూచితిమి. అటు తరువాత భూమిలో నుండి వచ్చిన మరొక క్రూరమృగము పరిచయం చేయబడెను. మృగము యొక్క ముద్ర ధరించు కొనిన వారిని గూర్చి కూడ చూచాము.
- 14వ అధ్యాయములో విమోచింపబడిన వారి విజయాన్ని మనం చూడబోవు చున్నాము. దుష్టులకు తీర్పుతీర్చబడింది. ఆత్మల పంట కూడ మనకు చూపబడింది.

**విమోచకుడు విమోచింపబడిన వారు:** (14:1-5).

- యోహాను సీయోను పర్వతము మీద గొర్రెపిల్లను చూచెను. ఈలోక పాపములను మోసికొను పోవుటకు వచ్చిన గొర్రెపిల్ల ఆయన (యోహాను 1:29; ప్రక 13:8).
- ఆ గొర్రెపిల్ల సీయోను పర్వతము మీద నిలుచుండెను. ఆయన వధింపబడెను గాని మృతులలో నుండి లేచి యున్నాడు గనుక విజేయుడై నిలుచున్నాడు. ఆదిమ క్రైస్తవులకు యిది గొప్ప ఆనందమునకు ఆధారమైయుండెను.
- సీయోను పర్వతము యెరూషలేముకు గురుతు (యెష 2:1-4). ఆది సంఘమునకు, పరలోకమునకు గురుతు (కీర్త 2:5-6; హెబ్రీ 12:22-23).
- 144వేల మంది గొర్రెపిల్లతో కూడ యుండిరి. ఈ లక్షానలభై నాగులువేల మంది భూమి మీద నున్న సంఘమునకు గురుతు (ప్రక 7:4). వారు గొప్ప జనసమూహము (7:9). పరలోకములో యున్న సంఘము

యొక్క దృశ్యం యిది.

**144వేల మంది ప్రత్యేకత:**

☞ గొర్రెపిల్ల నామమును తండ్రి నామమును తమ కొనళ్లయందు లిఖింపబడిన వారు క్రూరమృగము యొక్క ముద్రను ధరించుకొన్న వారికి భిన్నమైన వారు. ఈ నామము, ముద్ర భౌతికమైనది కాదు. దేవుడు తన ప్రజలపై కనబడురీతిగా ఆయన నామమును లిఖించనవుసరంలేదు. ఆయన సర్వజ్ఞాని; తన వారిన ఆయన ఎరుగును (2 తిమో 2:19).

☞ వీరొక క్రొత్త కీర్తనపాడిరి. (ప్రక 5:8-9 చదువుము).

☞ వారు భూలోకమునుండి కొనబడిన (విమోచింపబడిన) వారు. సంఘము క్రీస్తు రక్తముచే కొనబడెను (అపో.కా. 20:28). క్రైస్తవులు విలువ పెట్టికొన బడిన వారు (1కొరి 6:19-20; ఎఫెసీ 1:7; 1పేతురు 1:18-19).

☞ వారు స్త్రీ సాంగత్యమువలన అపవిత్రులు కాని వారు. అనగా ఆత్మీయముగా పవిత్రులు. విగ్రహారాధన చేయని వారు. కైసరు విగ్రహములకు మ్రొక్కని వారు. క్రైస్తవులు క్రీస్తుకు పవిత్రమైన కన్యకలుగా సమర్పించబడినవారు (2 కొరింథీ 1:2). క్రైస్తవులు క్రీస్తుకు వివాహం చేయబడిన వారు (రోమా 7:4).

☞ గొర్రెపిల్లను వెంబడించు వారితో సంఘము సమకూడి యున్నది. మనం ఆయన అడుగు జాడలయందు నడుచు కొనునట్లు క్రీస్తు మనకు మాదిరి ఉంచిపోయెను (1పేతురు 2:21).

☞ వారు దేవుని కొరకును గొర్రెపిల్ల కొరకును ప్రధమ ఫలముగా ఉండుటకై కొనబడిన వారు. యూదులు తమ పశువులలోను పంటలలోను ప్రధమ ఫలాన్ని దేవునికిచ్చేవారు (యిర్మీ 2:3; నిర్గమ 23:19 చదువుము).

"ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రధమ ఫలముగా ఉండునట్లు సత్యవాక్యమువలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను" (యాకోబు 1:18; రోమా 16:5; 1కొరింథీ 16:15 చదువుము).

☞ వీరి నోట ఏ అబద్ధమును కనబడలేదు. అనింద్యులు. వారు అబద్ధ బోధ చేయని వారు.

☞ వారు అనింద్యులు. దేవుని ప్రజలు నిష్కళంకులుగా యుండాలను నది దేవుని చిత్తము (ఎఫెసీ 1:4; 5:20).

**సువర్తమాన దూత** (14:6-7).

☞ ఈ దూత మధ్యాకాశమున నిత్య

సువార్తతో ఎగురుచుండెను.

☞అది సార్వజనిక నిత్య సువార్త. ఆ సువార్త ఆయా భాషలు మాటలాడు వారికి, ప్రతి దేశమునకు, జనాంగానికీ. ఈ దూత భూమి మీద సువార్త ప్రకటింప కూడదు. అట్లయితే శాపగ్రస్థుడగును (గలతీ 1:8–9; 2కొరింధీ 4:7).

☞తీర్పు వచ్చుచున్నదనే సువార్తను ఆ దూత ప్రకటించెను. హింసనొందుచున్న క్రైస్తవులకిది శుభవార్త.

☞ఆ సువార్తను దూత యోహానుకు బయలు పరచెను. దూత యొక్క వర్తమానము.

☞**దేవునికి భయపడుడి:** రోమా ప్రభుత్వముకు కాదు (ప్రసంగి 12:13).

☞**ఆయనను మహిమ పర్చుడి:** క్రూర మృగమునకది అవుసరంలేదు.

☞**దేవుని ఆరాధించుడి:** కైసరులు సృష్టి కర్తలు కారు గనుక ఆరాధనీయులు కారు (ప్రక 19:10).

☞**తీర్పుగడియ వచ్చెను:** అందువలన మానవులందరు ఆయనకు లోబడాలి (2 కొరి 5:10–11).

**నాశన దూత** (14:8)

☞ఈ దూత మహా బబులోను కూలిపోయెను, కూలిపోయెనని చెప్పెను.

☞పాతనిబంధనలో బబులోను కూలద్రోయబడుట గొప్పసంఘటన. నిబంధనల మధ్యకాలములో రోమా సామ్రాజ్యము, ఆ పట్టణము బబులోనుగా వర్ణించబడెను. రోమా కూలిపోక ముందే దాన్ని గూర్చి చెప్పబడెను (యెష 46:10; 48:33).

☞రోమా తన మోహోద్రేకముతో కూడిన వ్యభిచార మద్యమును సమస్తజనులకు త్రాగించెను (యిర్మీ 51:7).

☞తన బలాధిక్యము వలన రోమా దేశము మిగతా జనాంగములను పాడు చేసెను.

☞రోమా ఒక వేశ్యగా ప్రకటన గ్రంధములో వర్ణించబడెను.

☞17,18 అధ్యాయాల్లో దాని నాశనం వివరించబడింది.

**హెచ్చరిక దూత** (14:10–12):

☞ఈ దూత క్రూరమృగము నారాధించు వారిపైకి దేవుని తీర్పు ప్రకటించెను. వారు దేవుని ఉగ్రత పాత్రలో పోయబడిన కోపమను మద్యమును త్రాగుదురు.

ఆ మద్యములో ఏమీ కలుపబడదు. వారు దేవుని పూర్ణ ఉగ్రతను అనుభవింతురు.

వారు రాత్రింబగళ్లు నెమ్మది లేని

వారైయుందురు, అగ్ని గంధకములచేత బాధింపబడుదురు. పరిశుద్ధ దూతల యెదుటను గొర్రెపిల్ల యెదుటను బాధింపబడుదురు. క్రైస్తవులు హింసంపబడుచుండగా రోమా చక్రవర్తులు తిలకించేవారు. బీదలాజరు యెదుట ధనికుడు అగ్నిగుండములో బాధింపబడుచుండెను (లూకా 16: 19-31). దుర్మార్గులకు నిత్యశిక్షయే (మత్త 25: 46).

☞ దుర్మార్గులకు ఇట్టి శిక్షరాబోవు చున్నదని ఎరిగి క్రైస్తవులు విశ్వాసమును ఓర్పును కలిగి యుండాలి (యోహాను 14: 15, 21,23; 1యోహాను 2:3).

**ధన్యులైన మృతులు** (14:15):

☞ ధన్యులనగా దీవించబడిన వారు, సంతోషభరితులు

☞ ప్రభువునందు మృతి బొందిన వారే ధన్యులు. ప్రభువునందు అనగా ఆయన శరీరమైన సంఘమందు (గలతీ 3:27; రోమా 6: 3-5). రక్షించబడిన వారు ఆయన సంఘములో యుంటారు.

☞ యేసు ప్రభువునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంట బెట్టుకొని వచ్చును (1 థెస్స 4:14; 1కొరింథీ 15:17-20).

☞ వారు తమ ప్రయాసలు మాని విశ్రాంతి బొందుదురు. వారి క్రియలు వారివెంట వచ్చును. అనగా వారి వలుకుబడి, ప్రభావము నిలిచేయుండును (హెబ్రీ 11:4). దేవుడు మరచిపోడు. ఆయన యొద్ద జ్ఞాపకార్ధ గ్రంధమున్నది (మలాకీ 3:16).

**నీతివంట కోయు దూత**(14:14-16):

☞ ఇక్కడ మనుష్య కుమారుడు వర్ణించబడెను. దానియేలు 7:13-14లో ఆయన వర్ణన ఈయబడెను.

☞ ఆయన శిరస్సు మీద సువర్ణ విజయ కిరీటముండెను. చేతిలో వాడిగల కొడవలి, పంటకోయు నిమిత్తముండెను.

☞ ఇప్పుడు నీతిపంట కోయు దూత దేవాలయములో నుండి వచ్చి భూమిపైరు పండియున్నది, కోతకాలము వచ్చియున్నది వంటకోయుము మని మనుష్య కుమారునితో చెప్పెను.

☞ ఇదంతయు పరిశుద్ధులను సమకూర్చు దృశ్యమై యున్నది (మత్తయి13:30).

**నీతి వంటకోయు దూతలు**(14:17-20).

☞ 16వ వచనములో కోతకోయు దూత మనకు కనబడెను.

☞ బలిపీఠము నుండి వచ్చిన వేరొకదూత అగ్ని మీద అధికారము నొందినవాడు.

ప్రక 6:9-11లో పరిశుద్ధుల ప్రార్థనలకు ఫలితముగా వచ్చిన దూత కావచ్చును.

☞ ఈ దూతలు ద్రాక్షపండ్ల గెలలు కోయుమని చెప్పబడెను. వారు దుష్టులనందరినీ పోగుచేతురు. ద్రాక్షపండ్లను కోసి దేవుని కోపను ద్రాక్షతొట్టిలో వేసి త్రొక్కుదురు, రక్తము ప్రవహించును.

☞ ఈ అలంకార భాష అంతయు పాతనిబంధన లోనిదే. యెషయా 63:1-6; యోవేలు 3:13 చూడుము. మరల ప్రక 19:16 చూడుము. యేసు ప్రభువే ఆ ద్రాక్షటొట్టి త్రొక్కును.

☞ గుర్రముల కళ్లెము మట్టుకు రక్తము నూరు కోసుల దూరము ప్రవహించెను. అనగా దేవుని ఉగ్రత యొక్క తీవ్రత అంతగా యుండును.

☞ కోతకోయుటకు దేవుడు తన దూతల నుపయోగించు భావము మత్తయి 13:39, 41-42లో చూడవచ్చును.

**ముగింపు:** ద్రాక్షలతొట్టి పట్టణమునకు వెలుపట అనగా దేవుని సన్నిధికి వెలుపల యుంచబడెను. ప్రకటన 14వ అధ్యాయంలోని వర్తమానము గలతీ 6:7-8లో యున్నది: "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమను పంట కోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవవమను పంట కోయును".

**సత్యవాణి - క్రీస్తు సంఘంవారు ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీ యింటిలోనే పూర్తిచేసి బైబిలు జ్ఞానమును పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80, KAKINADA - 533 001.

గమనిక : సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపిచవలయును.

బైబిలు సర్వే - 6

# అరణ్య సంచారము ఐగుప్తు నుండి పారిపోవుట

క్రితం పాఠములో ఇశ్రాయేలీయులు ఈజిప్టు విడచి అరణ్యములో సంచరించుటకు సిద్ధముగా వున్నట్లు చూశాము. పదితెగుళ్ళు వచ్చిన తరువాత ఫరో వారిని వెళ్ళటానికి యిష్టపడ్డారు. ఐగుప్తు విడచి పెట్టేముందు వారు పస్కా అనే విందు చేసుకొన్నారు. 600,000 మంది పురుషులు వారి కుటుంబములు ఈజిప్టును విడచి వెళ్లుట ప్రారంభించారు. ఎర్రసముద్రము ఒడ్డునకు వచ్చాక వారు వెనక్కి తిరిగిచూశారు. ఫరో మనస్సు మార్చుకొని తిరిగి వారిని దాసరికమునకు యీడ్చుకొని పోవునట్లు సైన్యాన్ని పంపించటం వారు చూచి బహుభయాక్రాంతులై పోయారు. దేవుడు వారి దురవస్తను చూచి సముద్రము వైపు మోషేచేయి చాపుమని ఆజ్ఞాపించెను. అతడాలాగు చేసినంతనే సముద్రము రెండు పాయలుగా చీలి ఆరిన నేల ఏర్పడెను. ఇరువైపుల నీరు గోడవలే నిలచెను. ఇశ్రాయేలీయులు దానిలో నుండి నడచిపోయిరి. పౌలు 1కొరింథీ 10:3లో యీలాగు చెప్పుచున్నాడు. "మన పితరులు మేఘము క్రిందవుండిరి. అందరునూ బాప్తిస్మము పొందిరి. వారు మోషే ద్వారా పొందిన బాప్తిస్మము పూర్తిగా సముద్రములోను మేఘములోను మునుగుట. కనుక ఇది క్రీస్తు ఆజ్ఞాపించిన బాప్తిస్మమునకు పోలి నీటిలో సమాధి చేయుబడుటను సూచించుచున్నది. (రోమా 6:4, కొలస్సి 2:12).

**ఇశ్రాయేలు దేవునిమరచిపోవుట**

ఈజిప్టువారు ఇశ్రాయేలీయులను పాయలైన సముద్రములో కూడా వెంబండిచటం మొదలుపెట్టారు. కానీ ఇశ్రాయేలీయులంతా దాటిపోయిన తరువాత మోషే తన చేయిని చాపగా సముద్రము కలసి పోయింది. ఈజిప్టు వారి సేనలన్నియు సముద్రములో మృతిచెందాయి. 400 సం॥ల బానిసత్వం తరువాత ఇశ్రాయేలు సంతానము స్వతంత్రులయ్యారు. కొన్ని వారాలు వారు ఆగ్నేయ దిశగా ఆ ఎడారి మార్గమున ప్రయాణించారు. ఈ సమయములోనే వారు ఆహారం గురించి

నీళ్ళగురించి మోషే మీద సణుగుకొనటం ప్రారంభించారు. కనుక దేవుడు వారికి పూరేళ్ళను పక్షులను మన్నా అను వండనక్కర లేని ఆహారాన్ని ఆకాశం నుండి కురింపించాడు (నిర్గ16). వారి దాహం తీర్చటానికి మోషే రాతిని కొట్టగా దానినుండి నీళ్ళ ప్రవాహంవచ్చి వారి దాహం తీర్చింది. (నిర్గ17) దీనివలన మనకు దేవుని యొక్క ప్రజలపై ఆయనకు గల జాగ్రత్త తెలుస్తుంది.

అలా పయనించి సీనాయి ద్వీపకల్పమున దక్షిణ ప్రాంతమున గల సీనాయి పర్వతము వద్దకు చేరారు. ఇశ్రాయేలీయులను క్రీస్తు చనిపోవు వరకూ నడిపించగల ధర్మశాస్త్రాన్ని తీసుకు రావటం కోసం మోషే సీనాయి పర్వతాన్ని ఎక్కాడు దేవుని స్వహస్తంతో వ్రాయబడిన పదియాజ్ఞలు గల రెండు రాతిపలకలను దేవుడు మోషేకి యిచ్చాడు. 40 రోజులు కొండమీద గడపి తిరిగి క్రిందకు వచ్చేసరికి తన సోదరుడైన అహరోను ప్రజల కోరికపై ఆరాధించుటకు ఒక బంగారు దూడను చేయటం చూశాడు. ఒక్కోసారి మనం ఎంతటి విషయాలైనా యిట్టే మరచిపోతాం. ఇక్కడ ఇశ్రాయేలు వారు తమను బానిసత్వం నుండి తప్పించిన దేవుని కొద్దిరోజులలోనే మరచి విగ్రహాలను పూజించటం మొదలుపెట్టారు. దృశ్యాన్ని చూసిన మోషే కోపోద్రేకుడై దేవుడిచ్చిన పదియాజ్ఞల పలకలను పగులగొట్టాడు. ఆ బంగారు దూడను బూడిదచేసి వారందరిచే త్రాగించాడు. ఆదినాన్ని వారిలో 3000 మంది విగ్రహారాధన నిమిత్తం చంపబడ్డారు.

మోషే దేవునితో కలసి మాట్లాడడానికి సీనాయి కొండకిఎక్కి 40 రోజులు వుండిపోయాడు. దేవుడు మరలా రాతి పలకలను తిరిగి యిచ్చాడు. పదియాజ్ఞలేకాక మిగిలిన ధర్మశాస్త్రానంతటినీ మోషేకు యిచ్చాడు. దీనినే మనం మోషే ధర్మశాస్త్రమని పిలుస్తున్నాం.

**మోషే ధర్మశాస్త్రం**

మోషే ధర్మశాస్త్రము ఇయ్యబడి నప్పటి నుండి క్రీస్తు చనిపోవు వరకు అనగా 1500 సం॥లు అది ప్రజలపై అధికారం కలిగివుంది. ఈ కాలం "మోషే యుగం" అని పిలువబడింది. (ఒక్కోసారి దీన్ని యూదుల కాలం అని కూడా పిలవటం జరిగింది). ఎందుకంటే మోషే ద్వారా దేవుడు ధర్మశాస్త్రాన్ని అనుగ్రహించాడు కనక. దీనికి

ముందున్న కాలాన్ని "పితరుల యుగం" అన్నారు. దీని తరువాతికాలాన్ని "క్రీస్తు యుగం" అన్నారు. మానవ చరిత్ర యీ మూడు కాలాలలో ఏదో ఒక దానిలో ముడిపడి వుంటుంది. నిర్గమ కాండము, లేవీకాండము, సంఖ్యాకాండము, ద్వితియోపావదేశకాండములలో వ్రాయబడిన ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయుల జీవితములోని ప్రతిభాగాన్నీ శాశిస్తున్నది. దానియందు పౌరసంబంధమైన,నేర సంభంధమైన న్యాయసంబంధమైన విధులుకలవు. దాని యందు మతసంబంధమైన విధులు కలిగి యాజకులకు ప్రజలకు వారి విధులు పొందుపరచబడి యున్నవి. ప్రజలు అనుసరించవలసిన నైతిక విధానము దానియందు వ్రాయబడీయున్నది.

మోషే ధర్మశాస్త్రమంతయూ పదియాజ్ఞలలో యిమిడియున్నది. ఈ ధర్మవిధులు రెండు అంశాలుగా విభాగించబడ్డాయి: 1. దేవుని యెడల మానవుని విధులు 2. సాటిమానవునితో అనుసరించ వలసిన విధులు. ఒక్క 4వ ఆజ్ఞ (సబ్బాతం పరిశుద్ధముగా ఆచరించుట జ్ఞాపకముంచు కొనుము) తప్ప మిగిలిన 9 ఆజ్ఞలు ఏదో ఒక రూపాన్న ప్రభువు ద్వారాను ఆయన అపొస్తలుల ద్వారాను క్రొత్త నిబంధనలో చెప్పబడ్డాయి. ఈ 9 ఆజ్ఞలను మనం నెరవేర్చ వలసివుంది. కారణం, అది మోషే ద్వారా చెప్పుబడినందులకు కాదు గానీ ప్రభువు చెప్పినందువల్లనే మనం ఆచారించాల్సి వుంది. మోషే ధర్మశాస్త్రము క్రీస్తు మరణము ద్వారా కొట్టివేయబడినది కనుక (కొలస్స 2:14) మనం దానిని నేరవేర్చ వలసినపనిలేదు. 7వ రోజులేక శనివారం ఆచరించుట అనునది క్రొత్త నిబంధనలో వ్రాయబడిలేదు. దానికీ[illegible]ులు మనము దేవుని వారంలో [illegible]దటి దినాన్న క్రైస్తవులందిరితో కూడుకుని ఆరాధించాలి. (అ.కా. 20:7; 1కొరి 16:2).

మోషే ధర్మశాస్త్రము నందు 3 ప్రధానమైన పండుగలు కలవు. 1. పస్కా లేక పులియని రొట్టెల పండుగ. ఇది పంటలు కోతకోయుట మొదలు పెట్టునప్పుడు వచ్చును అనగా ఏప్రియల్ నెలలో వచ్చును. ఇది ఇశ్రాయేలీయులను దాస్యమునుండి దేవుడు విడిపించి నందులకు జ్ఞాపకార్ధచిహ్నాము. 2. వారముల పండుగ లేక పెంతెకోస్తు పండుగ. ఇది

పస్కావచ్చిన తరువాత 50వ రోజున వచ్చును. దీనితో కోతలు కోయుట పూర్తియగును. 3. గుడారముల పండుగ ఇది కోతలైన. తరువాత ఇశ్రాలీయులు 7 దినములు చేయుదురు. సాధారణముగ యిది ఆకురాల్చు కాలమున వచ్చును. ఇది కోతలుఅయి పోయిన తరువాత వచ్చును. ఇశ్రాయేలీయులు గుడారములలో నివశించుదురు. ఇదివారు అరణ్యసంచారము చేసినదినములు జ్ఞప్తికి తెచ్చుకొనుటకు ఏర్పరచబడినది.

ఇశ్రాయేలీయులు అరణ్యములో సంచరించు కాలమున దేవుడు ఒక గుడారాన్ని ఆరాధన స్థలముగా వుండుటకు నిర్మించాలని ఆజ్ఞాపించాడు. వారు ఎక్కడికి వెళ్ళితే దీన్ని అక్కడికి తీసుకుపోయేవారు. దీనినే ప్రత్యక్షగుడారం అని అన్నారు. దీనిలో రెండుభాగాలు కలవు. 1. పరిశుద్ధస్థలం 2. అతి పరిశుద్ధస్థలం. యాజకులు మాత్రమే పరిశుద్ధ స్థలములో ప్రవేశార్హము కలవారు. అతి పరిశుద్ధస్థలములోనికి సంవత్సరమునకు ఒక్కసారే ప్రధానయాజకుడు మహాప్రాయశ్చిత్తము దినమున తన పాపము కొరకు ప్రజల పాపముకొరకు బలిపశువు రక్తముతో ప్రవేశించును. యాజుకులు లేవీ వంశము నుండి ఎన్నుకొనబడుదురు. వారికి ప్రత్యేకమైన విధులు కలవు. ప్రజల పాపము నిమిత్తము బలులను వారే అర్పించుదురు. వీటిలో ప్రధానమైనవి 1. దహనబలులు: దేవునికి సమస్తమును ప్రతిష్టించుకొనుటకు ఇదిగుర్తు. 2. సమాధాన బలలు: దేవునికి సమస్తమును ప్రతిష్టించుకొనుట 3. పాపపరిహారార్థబలులు: పాపము ద్వారా మానవుడు అపవిత్రుడనై తినని ఒప్పుకొనుటకు ఇదిగుర్తు.

**40 సంవత్సరములు అరణ్యములో సంచరించుట:** ధర్మశాస్త్రమునను గ్రహించిన తర్వాత మోషే 12 మంది గూఢచారులను కానాను దేశమునకు పంపెను. ఈ కానాను దేవుని చేత అబ్రహాము, ఇస్సాకు, యాకోబులకు వాగ్దానము చేయబడి వారు నివసించిన దేశము. దీనినే దేవుడు వారి సంతానమున కిచ్చెదనని కూడా వాగ్దానము చేసెను. 12 మంది గూఢచారులు తిరిగివచ్చిన తర్వాత ఆ దేశము బహుసారవంతమైనదై పాలు, తేనెలు ప్రహించునది. కానీ 10 మంది మాత్రము ఆ దేశమునందు

జీవించు వారు బహు ఉన్నతులు బలాఢ్యులు కాబట్టి దానిని జయించుట అసాధ్యమని పలికిరి. కాలేబు, యెహోషువాలు మాత్రం దేవుని సహాయము ద్వారా మనము జయించగల మనివారు చెప్పినప్పటికి వారు అల్పసంఖ్యాకులగుటచే వారి మాట ప్రజలు వినలేదు. అధిక సంఖ్యాకులైన 10 మంది చెప్పిన దానిని ప్రజలు విని దేవుని మాటకు అవిధేయత చూపించినందువల్ల 40 సం॥లు అరణ్యము నందు (ఇశ్రాయేలీయులు) సంచరించిరి. ఈజిప్టు నండి బయలు దేరిన జనులందరు అరణ్యములో నశించిరి . కాలేబు, యెహోషువాలు మాత్రమే వాగ్దాన భూమిలో ప్రవేశించిరి.

ఇవి కాక 40 సం॥లలో వారు అరణ్యము నందు సంచరించిన సమయములో జరిగిన మిగిలిన సంగతులు గూర్చి మనకు తెలియదు. ఇశ్రాయేలీయులు దేశ దిమ్మరులవలె సీనాయి ద్వీపకల్పమందు ఒక ప్రదేశము నుండి ఒక ప్రదేశమునకు సంచరించిరి. ఈ కాలము నందే మోషేకు వ్యతిరేకముగా తన సోదరుడైన అహరోను, అక్కయైన మిరియం తిరుగు బాటు చేసిరి. ఆమె తిరుగు బాటుకు ప్రతిఫలముగా కుష్ఠరోగముతో దేవుడు మొత్తెను (సంఖ్యా:12). ప్రజలు పాముల ద్వారా కరువబడుట కూడా ఈ కాలమునందే జరిగెను (సంఖ్యా:21). బిలాము అను ప్రవక్తను ఇశ్రాయేలు ప్రజలను శపించటకు బిలాకు రాజు పిలిపించుట కూడా ఈ కాలము నందే జరిగెను. సంఖ్యా 22:24. ఈ కాలము నందే మోషే దేవుడికి వ్యతిరేకముగా రాతితో మాట్లాడుటకు బదులు దానిని కొట్టినందువల్ల పాపము చేసి వాగ్దాన భూమిలో ప్రవేశించు అర్హతను కోల్పోయెను. కాని ఇశ్రాయేలీయులు యొర్దానుదాటి వాగ్దానభూమిలో ప్రవేశించేముందు మోషే "నెబో" అను కొండ మీదికెళ్ళి వాగ్దాన భూమిని కంటితో చూచెను. ఆయన వనిమూర్తియైన తర్వాత అతను చనిపోయెను. ఇశ్రాయేలీయులు అరణ్య సంచారరము చేసిన వృత్తాంత మంతయు కూడా నిర్గమకాండము 13వ అధ్యాయము మొదలుకొని ద్వితీయోపదేశ కాండము చివరి వరకు చదివిన గ్రహించ గలము.

# సంక్షిప్త వార్తలు

బ్రదర్ జె.సి. ఛోట్‌గారు 2008 ఫిబ్రవరి మొదటి తేదీ శుక్రవారం అమెరికాలో వారి కాలమాన ప్రకారం మధ్యాహ్నం 12:20 గంటలకు ప్రభువునందు నిద్రించారు. జె.సి.ఛోట్‌గారు ఆంధ్రప్రదేశ్ క్రీస్తుసంఘస్థులకు చిరపరిచితులే. ఆయన గత 32 సంవత్సరాలుగా శ్రీలంక రేడియో ద్వారా ప్రసారమవుచున్న సత్యవాణి రేడియో కార్యక్రమములకు, ప్రస్తుతం రేడియో, T.V. కార్యక్రమాలకు వెన్నెముకగా నిలిచిన గొప్ప మిషనెరీ. ఆయన 1968వ సంవత్సరములో న్యూఢిల్లీలో క్రీస్తు సంఘమును స్థాపించి నడిపించారు. భారత దేశంలో పలుప్రాంతముల నుండి ఆయా భాషలలో వెలువడుచున్న ఇంచుమించు 12 మాసపత్రికలకు ప్రధాన పోషకుడు, సంపాదకుడు కూడా. ఆయన ప్రపంచములో పలు దేశములలో పలుభాషలలో క్రీస్తు సంఘములకు అనేక గ్రంధలు ప్రచురించి, సరఫరా చేస్తువచ్చారు. గత రెండు సంవత్సరలుగా కేన్సర్‌తో బాధపడుచు, చివరకు ప్రభువునందు నిద్రించారు. ఆయన సతీమణి బెట్టీ ఛోట్‌గారు మంచి వ్యక్త, గ్రంధకర్త బెట్టీగారి కొరకు ఆయన విడిచి వెళ్లిన బిడ్డలు, మనుమల కొరకు ప్రార్థించమనవి.

2008 జనువరి నెల 3వ తేదీన ఉండేశ్వరపురంలో రిక్కీగారు వాక్యపరిచర్య చేసారు. అక్కడ జి.జెకర్యాగారు సువార్త చాటుచున్నారు. జనువరి 5వ తేదీనాడు బంగారు మెట్టలోను, మాడుగులలోను రిక్కీగారు సువార్త కూటములు నిర్వహించారు. ఆ ప్రాంతములో ఇద్దరు బాప్తిస్మము పొందారు.

జనువరి 12వ తేదీ శనివారం రాజోలు మండలం కంతేటి వారిపాడు గ్రామములో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును సోదరులు రిక్కీగూటంగారు రిబ్బను కత్తిరించి ప్రతిష్టచేసారు, అక్కడ వాక్యపరిచర్య చేసారు. అక్కడ టి.అజయ్

కిషోర్‌గారు సువార్త చాటుచున్నారు. తదుపరి ఆ ప్రాంతములో యున్న సోదరులు చైతన్యపాలు, పద్మారావ్‌గార్లతో పని చేసారు.

2008 జనువరి 15వ తేదీనాడు కాకినాడ సత్యవాణి ఆవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. సోదరులు రిక్కీగారు కార్యక్రమము నంతటినీ సమర్థవంతముగా నడిపించారు. సోదరులు ఎన్. ఏలియా, ఎన్. మోజెస్, రాజా విజయ్‌కుమార్, పద్మారావ్, జాషువా గూటంగారు, జి. షద్రక్ గార్లు తదితర్లు వాక్యపరిచర్య చేసారు. వందకుపైగా సువార్తికులు హాజరై క్రైస్తవ సహవాస మాధుర్యాన్ని ఆస్వాదించారు.

జనువరి 20 నుంచి 24 వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో సెమినార్ జరిగెను. ప్రతి సంవత్సరము వలెనే వందలాది ప్రజలు హాజరై రోజుకు కనీసం 9 ప్రసంగాలను విని, ఆత్మీయ మేలును పొందారు. జాన్ ఫోర్డుగారు, ఆయన సతీమణి నేన్సీ ఫోర్డుగారు కూడ ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. 24వ తేదీనాడు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ యొక్క స్నాతకోత్సవము ఘనముగా జరిగెను.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 001